రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో యువరాజ్‌సింగ్ సత్తా



గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్న యువరాజ్ సింగ్

అబిడ్స్: రహీంపురాలో జైమాతాది రెజ్లింగ్ చాంపియన్‌షిప్ (కుస్తీ పోటీలు) 38 కిలోల విభాగంలో టి.యువరాజ్‌సింగ్ గోల్డ్‌మెడల్ సాధించాడు. ఆదివారం జరిగిన ఈ కుస్తీ పోటీల్లో యువ కుస్తీ వీరుడు యువరాజ్ సింగ్ సత్తాచాటి ప్రతిభను కనబరిచారు. యువరాజ్ సింగ్‌కు కోచ్‌గా విష్ణు పహిల్వాన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా యువరాజ్‌సింగ్ మాట్లాడుతూ..జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేస్తానన్నారు. కుస్తీ క్రీడలకు ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలని కోరారు.

జానపద కళాకారులు, కళలపై మైనర్ ప్రాజెక్టుకు భారతి ఎంపిక



గోల్కొండ: ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్సెస్ రిసెర్చ్ న్యూ ఢిల్లీ ప్రాయోజిత తెలంగాణ జానపద కళలు, కళాకారులు జీవితంపై మైనర్ ప్రాజెక్ట్ రిసెర్చ్‌కు డాక్టర్ పాలూరి భారతి ఎంపికయ్యారు. మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల జర్నలిజం విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ఈ మేరకు రిసెర్చ్ ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ ప్రాజెక్ట్ ఫండింగ్ కోసం తాము ఎంపిక అవ్వడం తనకు గర్వకారణమని అన్నారు. కనుమరుగవుతున్న తెలంగాణ జానపద కళలు, కళాకారుల డాక్యుమెంటేషన్‌పై తాను చేసే పరిశోధనలకు ఈ ఫండింగ్ దోహదపడుతుందన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోయింది'



దేవర వంశీని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోయిందని బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు దేవర వంశీ అన్నారు. ఆదివారం డివిజన్ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హామీలను నిలుపుకోవడంలో రేవంత్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నైజం ప్రజలకు తెలిసిపోయిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి నేత, సుధాకర్, అశ్విన్ తదితరులున్నారు.

చాంద్రాయణగుట్టలో నిరంజన్‌యాదవ్ పర్యటన



చాంద్రాయణగుట్ట: భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన నిరంజన్ యాదవ్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. నియోజవకర్గం ఇన్‌చార్జి ఎడ్ల పండరీనాథ్ ఆధ్వర్యంలో అన్ని డివిజన్ల అధ్యక్షులతో కలిసి కీలక ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నవీన్ యాదవ్, గోపి, విజయ్ కుమార్, జగదీష్, లక్ష్మణ్‌యాదవ్, మధుసూదన్ యాదవ్, సాయి ప్రసాద్, శివ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన బైక్‌తో జంప్

బంజారాహిల్స్: ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్ కింద శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నెంబర్‌ప్లేట్ లేకుండా వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. సదరు వాహనదారుడి వద్ద ధ్రువపత్రాలు లేకపోగా నెంబర్ ప్లేట్ కూడా లేకపోవడంతో ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ ఖాజామియా బైక్‌ను సీజ్ చేసి రోడ్డు పక్కన పెట్టాడు. వాహన తనిఖీల్లో పోలీసులు బిజీగా ఉండగా అదును చూసిన స్కూటరిస్టు పోలీసుల కళ్లు గప్పి సీజ్ చేసిన బైక్‌తో ఉడాయించాడు. ఎస్‌ఐ ఖాజామియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఏపీ 25 ఏఏ 2628 నెంబర్ వాహనంతో ఉడాయించిన నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

అబిడ్స్: స్వాతంత్ర సమరయ యోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రహీంపురాలోని ఆయన విగ్రహం వద్ద ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గులాబ్‌సింగ్, శ్యామ్‌సింగ్, గోకరణ్ సింగ్, జయదీప్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్, గోకరణ్ సింగ్ తదితరులు



నివాళులర్పిస్తున్న అభ్యుదయ సంఘ రచయితలు తదితరులు

గాంధీభవన్‌లో..

గాంధీభవన్‌లో జరిగిన భగత్‌సింగ్ వర్ధంతి వేడుకల్లో రాష్ట్ర పీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా, కుమార్‌రావులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భగత్‌సింగ్ చౌరస్తాలో..

జియాగూడ: జియాగూడ భగత్‌సింగ్ చౌరస్తాలో జియాగూడ బీజేవైఎం అధ్యక్షుడు తైలం సందీప్ సాగర్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని, బలిదాన్ దివాస్‌ను పురస్కరించుకొని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు జగదీష్ యాదవ్, సీనియర్ నాయకులు దర్పల్లి నర్సింహులు, రాజేందర్ డేగస్, ప్రేమాకుమార్, తులసిదాస్, కిషన్‌దామ, బాబురావు, రమేష్ చౌగ్లే, సత్యనారాయణ, సుభాష్‌కుమార్ వాగ్మారే, వెంకటేష్ యాదవ్, భాస్కర్, ప్రణయ్‌కుమార్, హరీష్‌కుమార్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మనిలాల్‌షా

భగత్‌సింగ్ అడుగుజాడల్లో నేటి యువత నడవాలి..

గౌలిపురా: భగత్‌సింగ్ అడుగుజాడల్లో నేటి యువత నడవాలని అభ్యుదయ సంఘ రచయితలు అన్నారు. గౌలిపురా డివిజన్ హనుమాన్‌నగర్‌లోని జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్‌లో ఆదివారం అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అరసం నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సూర్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శి గడ్డమీది చంద్రమోహన్ గౌడ్, ప్రముఖ సీనియర్ కవి రేడియం (కొండన్న), అరసం ఆర్గనైజర్స్ అటుకుల రాజు, జ్ఞాన భారతి మోడల్ హై స్కూల్ చైర్మన్ ప్రభాకర్ రావు, ఎస్.ఆర్.శ్రీనివాస్, శ్రీకాంత్, బి.సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కార్వాన్‌లో..

గోల్కొండ: దేశంకోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, బలిదానాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని బీజేపీ అధ్యక్షుడు ఉద్దడి జగదీశ్‌కుమార్ అన్నారు. ఆదివారం కార్వాన్ భాంజావాడిలో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌కు నివాళులర్పించారు. బీజేపీ, బీజేవైం నాయకులు ఉన్నారు.



జియాగూడలో నివాళులర్పిస్తున్న జగదీష్‌యాదవ్, సందీప్ సాగర్ తదితరులు



కార్వాన్ భాంజవాడిలో..

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు



గోల్కొండ ఏసీపీని సన్మానిస్తున్న సాయిబాబాచారి తదితరులు



ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు

గోల్కొండ: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం రిసాలబజార్‌లో గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఐదు దశాబ్దాలుగా సాయిబాబాచారి ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తూ హిందూముస్లిం పవిత్ర బంధాన్ని పటిష్టం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీకాంత్‌చారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, టీఎఫ్‌సీఓ అధ్యక్షుడు మహ్మద్ నజీబ్, సూర్యభాయ్, మహేందర్, విక్కీ తదితరులున్నారు.

ఉస్మాన్‌గంజ్‌లో..

అఫ్జల్‌గంజ్: ది జింజీర్ గార్లిక్ పోటాటో మర్చంట్స్ అసోసియేషన్ ఉస్మాన్ గంజ్ అధ్యక్షుడు ఎన్.నరేందర్‌గుప్తా, సెక్రెటరీ జి.సురేష్ జార్జ్, కోశాధికారి డి.శశికాంత్, ఉపాధ్యక్షుడు ఖలీముద్దీన్, డి.శివకుమార్ల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఉస్మాన్‌గంజ్‌లో దాదాపు 500 మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందు అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచే శాస్త్రీయ కళపై మక్కువ కల్పించాలి



కళాకారులతో నాట్య గురువు ప్రసన్నరాణి తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి చిన్నప్పటి నుంచే శాస్త్రీయ సంగీత కళలపై మక్కువ కల్పించాలని ప్రముఖ నాట్య గురువు డాక్టర్ ఆర్.ప్రసన్నరాణి అన్నారు. ఆదివారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమి ఆధ్వర్యంలో ఉగాది, మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు.

అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు జాయింట్ డైరెక్టర్ కె.శశిశ్రీ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.స్వప్న, ఎంఎస్‌ఆర్ స్కూల్ డైరెక్టర్ శాంతి పవర్, అకాడమి వ్యవస్థాపకురాలు విజయమాధవి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు..పరుగు..

- ఉప్పుగూడలో పొంగిపొర్లుతున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



ఉప్పుగూడ ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ డివిజన్ ప్రధాన రహదారిపై రెండు నెలలుగా కచ్చామోరీ నుంచి మురుగునీరు పారుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులకు చీమకుట్టినట్లుగా కూడా లేదు. ఉప్పుగూడ మహంకాళి ఆలయ వెనుక భాగంలోని ప్రధాన రహదారి వద్ద లీకవుతున్న మురుగు ఆలయం ముందు నుంచి శివాజీనగర్ ప్రధాన రహదారి వరకు పారుతుండడంతో భక్తులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తోట్ల గుడి (కాళికామాత ఆలయం), మహంకాళి ఆలయానికి వెళ్లే భక్తులు మురుగునీటిలో ముక్కు మూసుకొని వెళ్లి రావడం తలచుకొని తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. స్థానికంగానే విద్యాలయాలు ఉండడంతో విద్యార్థులు అపరిశుభ్రమైన వాతావరణంలో నడవలేని పరిస్థితి నెలకొంది. సమస్య తీవ్రత విషయమై స్థానిక బీజేపీ నాయకులు కూడా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యంగానే ఉంది. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ ఈఈని 'సాక్షి' సంప్రదించగా పైప్‌లైన్ పాడయ్యిందని, నూతన పైప్‌లైన్ కోసం ప్రతిపాదనలు పంపామని నింపాదిగా సమాధానమివ్వడం కొసమెరుపు.



మహంకాళి ఆలయం ముందు..

ముగిసిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ వేడుకలు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీలో రెండు రోజుల పాటు జరిగిన హైదరాబాద్ జిల్లా స్థాయి వికసిత భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్–2025 పోటీలు ముగిశాయి. జిల్లా స్థాయికి ఎంపికైన 150 మంది యువతీ యువకులు 'ఒక దేశం–ఒక ఎలక్షన్'అనే అంశంపై మాట్లాడారు. ఉత్తమంగా మాట్లాడిన 10 మంది అభ్యర్థులను జ్యూరీ ఎంపిక చేసింది. వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. యువ నాయకురాలు శ్రావ్యా రెడ్డి, అడ్వకేటు శ్రీకాంత్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డా.భాస్కర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులు డా.శంకర్ కుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. సిటీ కాలేజీలో యూత్ పార్లమెంట్ వేడుకలను ఘనంగా నిర్వహించారని నెహ్రూ యువ కేంద్ర బాధ్యులు ఖుష్బూ గుప్తా ప్రశంసించారు. రెండు రోజుల కార్యక్రమాన్ని డాక్టర్ డి.నాగరాజు సమన్వయం చేయగా ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా.కృష్ణ చంద్రకీర్తి, డా.తిరుపతి, డా.సుదక్షణ, డా.వి.శ్రీదేవి, డా.రవీంద్ర సహకారం అందించారు.

సీఎస్‌ఏ లాసెట్ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ తరగతులు ప్రారంభం

నాంపల్లి: సీఎస్‌ఏ లాసెట్ అకాడమీ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభమైంది. ఆదివారం రెడ్‌హిల్స్‌లోని అకాడమీలో ప్రారంభమైన కోచింగ్ తరగతులను విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముస్లిం మైనార్టీల్లో నిజాయితీ, నైపుణ్యం కలిగిన న్యాయవాదుల కొరత ఉందని తెలిపారు. ఈ లోటును తీర్చడానికి సీఎస్‌ఏ బోర్డు ఉచిత ఆన్‌లైన్ లాసెట్ కోచింగ్ అందించడం సంతోషించాల్సిన విషయం అన్నారు. న్యూ ఢిల్లీకి చెందిన ఐఏఎస్ కోచ్ సమీర్ అహ్మద్ సిద్దిఖీ తమ విలువైన సలహాలను అందిస్తూ న్యాయవాద వృత్తిని కేవలం ఆర్థిక లాభం కోసం ఎంచుకోవద్దని స్పష్టం చేశారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ సయీదుద్దీన్ మాట్లాడుతూ..నైపుణ్యం కలిగిన న్యాయవాదులను తయారు చేయడమే సీఎస్‌ఏ ముందున్న లక్ష్యమని అన్నారు. అకాడమీ డైరెక్టర్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ..ఇప్పటి వరకు తమ సంస్థ పక్షాన 350 వెబ్‌నార్లు, సెమినార్లు నిర్వహించినట్లు చెప్పారు. సీఎస్‌ఏ అకాడమీ ద్వారా ఉచిత ఆన్‌లైన్ తరగతులకు హాజరు కావాలనుకుంటే 7989787990లో సంప్రదించవచ్చు.

'మైనార్టీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం'

చార్మినార్: ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఎమ్మెల్సీ కవితను కోరినట్లు చార్మినార్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది తెలిపారు. ఈ మేరకు ఆదివారం నాయకులు మహమ్మద్ సైఫుద్దీన్ లోదితో కలిసి ఆమెతో సమావేశమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంజాన్ మాసం సందర్భంగా అప్పటి తమ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు రంజాన్ కిట్లను అందజేశామని..నెల పూర్తయితున్నప్పటికీ ఇప్పటి వరకు పంపిణీ ఊసే లేదన్నారు. అంతేకాకుండా ముస్లిం మైనార్టీ ప్రజల అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన నిధులను ఇఫ్తార్ పార్టీ పేరుతో దుర్వినియోగం చేయడం సరైనది కాదనే విషయాన్ని ఆమెతో తెలియజేశామన్నారు.



కవితతో సమావేశమైన ముహమ్మద్ సలావుద్దీన్ లోది

విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి



విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: విద్యుత్‌శాఖ అధికారులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలీచౌకీ మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అకాల వర్షాలు, ఈదురుగాలులు వీచినప్పుడు అధికారులు స్వయంగా అప్రమత్తమై క్షేత్రస్థాయి సిబ్బందిని కూడా అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా, విద్యుత్ తీగల పరివర్ధన తదితర వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా విద్యుత్ సరఫరాలో ఎక్కువగా అవంతారాలు రాకుండా చూడాలని ఆయన కోరారు. గత కొన్ని రోజులుగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాల గురించి తనకు ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన అన్నారు. అంతేకాకుండా మినీ ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు జరగకపోవడం లాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన అన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పుడూ కార్యాలయంలో అందుబాటులో ఉండి అత్యవసర సేవలకు వెంటనే రంగంలోకి దిగాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఏడీఈ ఎ.మాధవరావు, ఏఈ ఆపరేషన్స్ మహ్మద్ జాఫర్ తదితరులు ఉన్నారు.

వీర హనుమాన్ విజయ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

చాంద్రాయణగుట్ట: ఏప్రిల్ 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కందికల్‌గేట్ చిత్రగుప్తా స్వామి ఆలయం సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు మాట్లాడుతూ.. గౌలిపురాలోని మిత్రా క్లబ్ మైదానం నుంచి ఈ వీర హనుమాన్ విజయ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ విజయ యాత్రలో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జనరల్ సెక్రటరీ పాండు చారి, జిల్లా అధ్యక్షులు విశాల్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి విశాల్ సునాకర్, జిల్లా ఉపాధ్యక్షులు భానుమూర్తి, బజరంగ్ దళ్ సిటీ కన్వీనర్ అఖిల్, జిల్లా కన్వీనర్ పవన్, కో కన్వీనర్ శ్రీనుతో పాటు హరికిరణ్, సాయిరాం, కార్తీక్, అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు

సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం

అఫ్జల్‌గంజ్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కురుమ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి పారదర్శకంగా సంఘం ఎన్నికలు, పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ముస్లింపుల్ వంతెన వద్ద ఉన్న రాష్ట్ర కురుమ సంఘం భవనం కార్యాలయంలో జంటనగరాల కురుమ సంఘం, నేతృత్వంలో కురుమల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి యెగ్గె మల్లేష్ ముఖ్యఅతిథిగా హాజరై సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నియోజకవర్గాల వారీగా, గ్రామ మండలాల వారీగా, కురుమల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి స్థానిక ఎన్నికలు నిర్వహించి అనంతరం జంట నగరాలు, రాష్ట్ర ఎన్నికలు నిర్వహించే ఇస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, రాష్ట్ర నాయకులు, కొలువుల నరసింహ, చీర శ్రీకాంత్, కట్ట మల్లేశం, ఎక్కాల కన్నా, కొండల రాజు, సర్పా వినోద్‌కుమార్, బూరగడ్డ పుష్పనగేష్, తూమ్‌కుంట అరుణ్‌కుమార్, టి.బాలమణి, మిరాయాల విజయ పాల్గొన్నారు.

హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా లక్ష్మణ్ గుప్తా

గౌలిపురా: హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ తొమ్మిదవ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయం సన్నిధిలో నిర్వహించారు. ఈ సమావేశంలో సరాబు లక్ష్మణ్ గుప్తాను హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా మరోసారి కొనసాగించాలని మాజీ అధ్యక్షుడు రెడ్డిశెట్టి చంద్రశేఖరరావు ప్రతిపాదించగా.. మాజీ అధ్యక్షులు కాశెట్టి పాండు, ఐపీపీ మ్యాడం దయాకర్ గుప్తా బలపరిచారు. రాబోయే రెండు సంవత్సరాలకు హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌గుప్తా కొనసాగుతారని సభలో కార్యవర్గం మొత్తం ఆమోదించింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ పరిధిలోని లాల్‌దర్వాజా, గౌలిపురా మండల ఆర్యవైశ్య సంఘానికి మార్చి 20న సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీరాం కోటయ్యను హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభలో అధ్యక్షుడిగా ప్రకటించారు.



లక్ష్మణ్‌గుప్తాను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

అంబేడ్కర్ లోహియా ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించాలి



అఫ్జల్‌గంజ్: చుడిబజార్‌లో 8 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంబేడ్కర్ లోహియా ఫంక్షన్‌హాల్‌కు మరమ్మతులు చేపట్టి ప్రారంభించాలని మాదిగ బంధుమిత్ర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బంధుమిత్ర సంఘం నేతలు వెంకటేష్, అనిల్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సుమన్‌కుమార్, కమల్ పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..8 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఏ ఒక్క అధికారి గాని, ఏ ఒక్క ప్రజాప్రతినిధిగాని ఈ మరమ్మతులు చేపించడం లేదన్నారు. బస్తీవాసులకు ఉపయోగపడే విధంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక్కసారి పర్యటించి అధ్వానంగా తయారు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

సమస్యలతో సతమతం..

- రహీంపురా వ్యాయామశాలలో మౌలిక వసతుల కరువు
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

జియాగూడ: రహీంపురా లాల్ బహదూర్ ఆట స్థలంలో ఉన్న వ్యాయామశాల సమస్యలతో పోటీపడుతోంది. సుమారు 40 ఏళ్ల క్రితం యూత్ కోసం వ్యాయామశాల భవనం నిర్మించి అప్పట్లో అన్ని సౌకర్యాలు కల్పించింది. ప్రత్యేకంగా వ్యాయామ శిక్షకుడిని నియమించగా ఎంతో మంది క్రీడాకారులు నేర్చుకొని కుస్తీ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించారు. వ్యాయామశాలలో శిక్షణ పొందిన వారు జాతీయ స్థాయిలో పోటీపడుతున్నప్పటికీ సమస్యలు నెలకొన్నాయి. ప్రతిరోజూ సుమారు 60 మందికి పైగా చిన్నారులు, యువకులు కుస్తీలు నేర్చుకోవడానికి వస్తుంటారు. ఇందుకు కావాల్సిన మ్యాట్ కవర్లు (గద్దీలు) సరిపోయే విధంగా లేకపోవడంతో కుస్తీలు నేర్చుకునే సమయంలో వారు కిందపడి గాయాలపాలవుతున్నారు. అలాగే వ్యాయామం చేసే సామగ్రి కూడా తక్కువగా ఉండడంతో ఒకే సమయంలో అందరు చేయడానికి చాలా సమయం పడుతుంది. ఉదయం వేళల్లో చేయాల్సిన వ్యాయామం సరిపడా సామగ్రి లేక చాలా మంది వెనుదిరుగుతున్నారు. ఇక 60 మంది యువకులు ప్రతిరోజు కుస్తీ శిక్షణలకు, వ్యాయామం కోసం వస్తున్నప్పటికీ బాత్‌రూమ్ టాయిలెట్స్ లేకపోవడం మరో సమస్య ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.



రహీంపుర ఆట స్థలంలో వ్యాయామశాల భవనం

ప్రభుత్వం కుస్తీ క్రీడలను ప్రోత్సహించాలి..



ఈ వ్యాయామశాల నుంచి కుస్తీ పోటీల్లో జాతీయ స్థాయిలో యువకులు రాణిస్తున్నారు. వ్యాయామశాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తే వారు మరింతగా క్రీడల్లో శిక్షణపొంది రాణిస్తారు.

– రాజు కత్రి, కుస్తీ క్రీడాకారుడు